ప్రజాశక్తి

సోమవారం మే 13 2024 8 పేజీలు


శ్రీకాకుళం



తొలిసారి ఓటేస్తున్నారా..? అయితే ఇవి తెలుసుకోండి..!

(2లో)

సార్వత్రిక ఎన్నికల సమరం తుది అంకానికి చేరుకుంది. ఎన్నికల్లో ఓటర్ల తీర్పు ఇచ్చే రోజు వచ్చేసింది. సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. జిల్లాలో పోలింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను ఆదివారం చేపట్టారు. ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. పోలింగ్ ముగిశాక ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి ఇవిఎంలను తరలించనున్నారు.



ఓటేద్దాం రండి

- నేడు సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 18,92,457 మంది
- ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు వరకు పోలింగ్
- పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి మరికొద్ది గంటల్లో పోలింగ్ మొదలు కానుంది. జిల్లాలో మొత్తం 18,92,457 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో 9,29,859 మంది పురుషులు, 9,45,945 మంది మహిళలు ఉన్నారు. ఇతరులు 130 మంది ఉన్నారు. ఆర్మీ, నేవీ తదితర రక్షణ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు 16,448 మంది ఓటర్లుగా నమోదయ్యారు. 85 ఏళ్ల దాటిన ఓటర్లు 11,422 మంది ఉండగా, వికలాంగులు 21,546 మంది ఉన్నారు. జిల్లాలోని ఎనిమిది (మిగతా...2లో)



ఎన్నికల సిబ్బంది, సామగ్రిని తరలించేందుకు సిద్ధం చేసిన బస్సులు

ఓటు వేసే ముందు... ఒక్క క్షణం



ఒక్క క్షణం... ఓటు వేసే ముందు ఒక్క క్షణం ఆలోచించండి...! అధిక ధరలు, అవినీతి, నిరుద్యోగం, వలసలు, కానరాని కనీస వేతనాలు, కరువైన ఉద్యోగ భద్రత, రైతుకు లభించని గిట్టుబాటు ధర, మేడిపండు చందమైన వైద్యం ఇలా... చెప్పుకుంటూ పోతే అన్నీ సమస్యలే. మన భవితవ్యాన్ని ఐదేళ్ల పాటు నిర్ణయించే శాసన కర్తలను చట్టసభలకు పంపించే అతి కీలకమైన రోజు ఇది. మద్యం సీసాకో, డబ్బుకో మన ఓటును విక్రయించుకుంటే ఐదేళ్ల ప్రగతి కుంటుపడుతుంది. లక్షలు వెచ్చించి పదవిని పొందిన వారు అడ్డగోలుగా కోట్లు సంపాదిస్తారు. ఇప్పుడు డబ్బు తీసుకొని ఓటేస్తే ప్రశ్నించే నైతిక హక్కునూ కోల్పోతాం. ప్రలోభాల వలకు చిక్కకుండా విజ్ఞతతో ఓటేద్దాం. మన గొంతుకగా చట్టసభల్లో గళమెత్తి, సమస్యలు పరిష్కరించే నాయకుడిని ఎన్నుకుందాం. ఉజ్వల భవిష్యత్ భవంతికి మనమే పునాదిరాళ్లు అవుదాం.

ఎపిక్ కార్డు లేకున్నా ఓటు వేయొచ్చు



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మీకు ఓటరు గుర్తింపు (ఎపిక్) కార్డు లేకున్నా, ఓటరు జాబితాలో మీ పేరు ఉంటే ఓటు వేయొచ్చు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో దేని సహాయంతోనైనా మీ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. కొత్తగా ఓటర్ ఐడి కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారు కూడా ఎపిక్ కార్డు రాకున్నా మీ ఓటు హక్కును ఉపయోగించుకోవచ్చు. ఓటు (మిగతా...2లో)

ప్రలోభాలకు భారీ ఖర్చు

- ఓటుకు రూ.వెయ్యి వరకు పంపిణీ
- తాగినోళ్లకు తాగినంత మందు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు భారీగా ఖర్చు చేశారు. ఈనెల 11న ప్రచారం ముగియడంతో ఆ రోజు రాత్రి నుంచే పంపకాలపై ప్రధానంగా దృష్టిసారించారు. ఒకట్రెండు చోట్ల డబ్బులు కూడా ఇచ్చారు. అత్యధిక ప్రాంతాల్లో ఆదివారమే పంపకాల పని ఉధృతంగా సాగింది. వైసిపి, టిడిపి అభ్యర్థులు పంపిణీలో పోటీ పడ్డారు. ఒక్కో నియోజక వర్గంలో ఒక్కో మాదిరిగా డబ్బులు పంపిణీ చేశారు. పోరు హోరాహోరీగా ఉన్న చోట పోటాపోటీగా డబ్బులు పంచుతున్నట్లు తెలిసింది. టెక్కలిలో రెండు పార్టీలూ చెరో రూ.వెయ్యి పంచినట్లు తెలిసింది. నరసన్నపేటలో వైసిపి నాయకులు అన్ని ప్రాంతాల్లో రూ.వెయ్యి పంచగా, తమకు ఓట్లు పడవని గుర్తించిన ప్రాంతాల్లో రూ.500 చొప్పున ఇచ్చారు. ఇచ్ఛాపురంలో టిడిపి ఓటుకు రూ.500 పంచినట్లు తెలుస్తోంది. తమకు కచ్చితంగా ఓటేస్తారన్న వారికి, తటస్థులకు మాత్రం రూ.వెయ్యి చొప్పున ఇచ్చినట్లు చర్చ సాగుతోంది. పలాసలో రెండు పార్టీలూ ఓటుకు రూ.500 ఇచ్చినట్లు తెలిసింది. పాతపట్నంలో టిడిపి, వైసిపి ఒక్కో చోట రూ.500, మరోచోట రూ.వెయ్యి వరకు పంపిణీ చేసినట్లు సమాచారం. శ్రీకాకుళం నియోజకవర్గంలో (మిగతా...2లో)



ఆదర్శం... ఈ పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో 45 చోట్ల ఏర్పాటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఓటర్లను ఆకర్షించేందుకు, ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం కొన్ని పోలింగ్ కేంద్రాలను ఆదర్శ (మోడల్) పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దుతోంది. జిల్లాలో ఇలా ఎంపిక చేసిన 45 పోలింగ్ కేంద్రాలను పూర్తిగా అలంకరించి ముస్తాబు చేసింది. దివ్యాంగులు, యువ, మహిళ (పింక్) పేరుతో ఉండే ఆయా ప్రత్యేక పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతి సదుపాయాలకు అదనంగా కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి. దివ్యాంగుల పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులు, యువ పోలింగ్ కేంద్రంలో యువ ఉద్యోగులు, మహిళా పోలింగ్ కేంద్రంలో మహిళా ఉద్యోగులే విధులు నిర్వహించనున్నారు. విభిన్న రీతుల్లో థిమాటిక్‌గా ఏర్పాటు చేసిన ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఆకట్టుకుంటున్న అంశాలేమిటో ఒక్కసారి పరిశీలిద్దాం.



యువ : యువ కేంద్రంలో యువతకు సంబంధించిన అంశాలు ప్రత్యేకంగా కనిపించేలాగా ప్రదర్శిస్తారు. విద్యార్థులు తయారు చేసిన గ్రీటింగ్స్, స్లోగన్స్ ఉంటాయి. తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవడం, సామాజిక బాధ్యతలు వంటి నినాదాలు ఉంటాయి. వీరు ఓటు వేసే కేంద్రంలో పూర్తిగా రెడ్‌కార్పెట్ పరిచి ఉంటుంది. వీరిని విఐపిలుగా ఆహ్వానించే లాగా, యువతకు స్ఫూర్తినిచ్చేలా పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు ఉంటాయి. (మిగతా...2లో)



ఎపిక్ కార్డు లేకున్నా ఓటు వేయొచ్చు

వేసేందుకు ఓటరు గుర్తింపు కార్డుతో పాటు 12 ఇతర గుర్తింపుకార్డులను తీసుకెళ్లవచ్చని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కాబట్టి మీకు ఓటరు కార్డు లేకున్నా చింతించాల్సిన పని లేదు.

ముందు ఏం చేయాలి

పోల్ చీటీలు అందకపోతే నిర్దేశిత పోలింగ్ కేంద్రం వద్ద ఉండే బిఎల్ఒ వద్దకు వెళ్లాలి. వారు ఓటరు జాబితాలో సరిచూసి ఓ చీటీపై మీ క్రమసంఖ్య, పేరు రాసి ఇస్తారు. గతంలో ఎక్కడ ఓటేశారో, అక్కడికి వెళ్లి బిఎల్ఒలను సంప్రదించాలి. కొత్తగా ఓటు వచ్చిన వారు మాత్రం దరఖాస్తు సమయంలో ఏ కేంద్రం అని నమోదు చేసుకున్నారో, అక్కడికి వెళ్లి పోల్ చీటీ పొందాలి.

గుర్తింపు కార్డులు ఇవే...

- ఫొటో ఓటరు స్లిప్పు
- ఫొటో గుర్తింపు కార్డు (ఎపిక్)
- ఆధార్ కార్డు
- పాస్‌పోర్టు
- డ్రైవింగ్ లైసెన్స్
- కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల ఫొటో గుర్తింపుకార్డు
- బ్యాంకులు, పోస్టాఫీసు జారీ చేసిన పాసుపుస్తకం (ఫొటోతో ఉన్నవి)
- పాన్ కార్డు
- జనగణన ఆధారంగా జారీ చేసిన స్మార్ట్ కార్డు
- ఫొటో ఉన్న పెన్షన్ కార్డు
- ఎన్ఆర్ఇజిఎ జారీ చేసిన జాబ్‌కార్డు.

పోలింగ్ కేంద్రంలోకి ఫోన్లు నిషేధం

పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లను తీసుకెళ్లడం పూర్తి నిషేధం. కేంద్రం బయటే ఉంచి లోపలకు వెళ్లాల్సి ఉంటుంది. కొందరు అధికారుల కళ్లుగప్పి ఫోన్‌ను తీసుకెళ్లి, ఓటు వేసే సమయంలో ఫొటో తీసుకోవడం నేరం. పోలింగ్ కేంద్రంలో పొగ తాగడం, పేలుడు పదార్థాలు తీసుకెళ్లడం నిషేధం.

ప్రలోభాలకు భారీ ఖర్చు

వైసిపి, టిడిపి నాయకులు చెరో రూ.500 చొప్పున పంపిణీ చేశారు. ఆమదాలవలసలో రెండు పార్టీలూ ఓటర్లకు చెరో రూ.500 చొప్పున పంపిణీ చేశాయి. ఎచ్చెర్ల నియోజకవర్గంలో వైసిపి ఓటుకు రూ.500 ఇచ్చినట్లు సమాచారం.

తాగినోళ్లకు తాగినంత

గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో రెండు పార్టీలు శిబిరాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఎన్నికల ప్రచారం మొదలుకుని ఇప్పటివరకు పనిచేసిన వారికి మనసారా మందును అందిస్తున్నాయి. ఒకరిద్దరు అభ్యర్థులు మినహా అందరూ ఎన్నికల షెడ్యూల్ వెలువరించక ముందే మద్యాన్ని డంప్ చేసుకున్నాయి. చివరి క్షణంలో టిక్కెట్లు పొందిన వారికి మందు సమకూర్చుకోవడం సాధ్యపడలేదని తెలుస్తోంది.

ఏదీ అధికారుల నిఘా?

టిడిపి, వైసిపి నగదు భారీగా పంపిణీ చేస్తున్నా, ఎన్నికల అధికారుల కంటికి చిక్కకపోవడం విచిత్రంగా ఉంది. వ్యయ పరిశీలకులు కేవలం అభ్యర్థులు తాము చూపిన ఖర్చులనే లెక్కల్లోకి తీసుకుంటున్నారు తప్ప వీటిని పట్టుకుని కేసులు నమోదు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగదు పంపిణీకి వైసిపి అభ్యర్థులు చాలాచోట్ల మానేసిన వాలంటీర్లను వినియోగించుకున్నారు. వాలంటీర్లకు అందరి చిరునామాలు తెలియడంతో, వారే డబ్బులు పంపిణీ చేసే వ్యక్తులను ఇళ్ల వద్దకు తీసుకొచ్చి ఓటరు స్లిప్పులతో పాటు నగదు అందిస్తున్నారు.

ఓటేద్దాం రండి

నియోజకవర్గాల్లో ఏడింటిలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. పోలింగ్ కోసం బ్యాలెట్ యూనిట్లు (ఇవిఎం), కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు చెరో 4,716 చొప్పున వినియోగిస్తున్నారు. ఇవిఎం మిషన్లలో లోపాలు తలెత్తితే, నియోజకవర్గానికి ముగ్గురేసి చొప్పున భారత్ హెవీ ఇంజినీరింగ్ లిమిటెడ్ ఇంజినీర్లను అందుబాటులో ఉంచుతున్నారు.

2,358 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లోని 1685 ప్రాంతాల్లో 2,358 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పాతపట్నంలో అత్యధికంగా 323 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇచ్ఛాపురంలో 229, పలాసలో 284, టెక్కలిలో 315 కేంద్రాలు ఉన్నాయి. శ్రీకాకుళం నియోజకవర్గంలో 279, ఆమదాలవలసలో 259, ఎచ్చెర్లలో 309, నరసన్నపేటలో 290 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేని 36 కేంద్రాలను షాడో సెంటర్లుగా గుర్తించి, పోలీసుశాఖ వినియోగించే హ్యాండ్ సెట్లను అందించారు. అప్పటికీ సమస్యలు తలెత్తితే, ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒక రన్నర్‌ను ఏర్పాటు చేశారు. ఇవన్నీ పాతపట్నం నియోజకవర్గంలో ఉన్నాయి.

520 సమస్యాత్మక కేంద్రాలు

ఎనిమిది నియోజకవర్గాల్లో 297 ప్రాంతాల్లోని 520 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. వాటిలో అత్యధికంగా నరసన్నపేటలో 95 కేంద్రాలు ఉన్నాయి. టెక్కలిలో 82 కేంద్రాలు, ఇచ్ఛాపురంలో 67, పలాసలో 57, పాతపట్నంలో 56 కేంద్రాలు ఉన్నాయి. ఆమదాలవలస, ఎచ్చెర్లలో 59 కేంద్రాలు చొప్పున ఉన్నాయి.



ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తున్న అధికారులు



ఎన్నికల సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

1655 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

జిల్లాలో 1655 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. పోలింగ్ సరళిని లైవ్ ద్వారా జిల్లా కేంద్రంలోని కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షించనున్నారు. జిల్లాలో అత్యధికంగా టెక్కలి నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేపడుతున్నారు. పోలింగ్ సరళిని చిత్రీకరించేందుకు 333 మంది వీడియోగ్రాఫర్లను వినియోగిస్తున్నారు.

ఎన్నికల విధుల్లో 17,373 మంది సిబ్బంది

ఎన్నికల్లో మొత్తం 17,373 మంది సిబ్బందిని విధులకు వినియోగిస్తున్నారు. వీరిలో 2,828 మంది ప్రిసైడింగ్ అధికారులు (పిఒ), 2,819 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఎపిఒ)తో పాటు 11,059 మంది ఇతర పోలింగ్ అధికారులు (ఒపిఒ)తో 661 మంది సూక్ష్మ పరిశీలకులను విధులకు కేటాయించారు.

పటిష్ట పోలీస్ బందోబస్తు

పోలింగ్ రోజు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం రెండు వేల మంది పోలీసులను విధులకు వినియోగిస్తున్నారు. 11 పారామిలటరీ బృందాలు, రెండు ప్లాటూన్ల కేంద్ర బలగాలను మోహరించారు. మొబైల్ పెట్రోలింగ్ పార్టీలతో పాటు సిఐ, డిఎస్‌పి, అదనపు ఎస్‌పి స్థాయి అధికారులతో స్పెషల్ స్టాటిక్ ఫోర్స్, క్విక్ యాక్షన్ బృందాలను నియమించారు. వీరితోపాటు ఎన్నికల విధుల కోసం ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో పాటు మాజీ సైనికోద్యోగులను వినియోగిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో 4,624 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

బరిలో 86 మంది అభ్యర్థులు

ఎన్నికల బరిలో మొత్తం 86 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 73 మంది, శ్రీకాకుళం ఎంపీ స్థానానికి 13 మంది పోటీలో ఉన్నారు. వైసిపి, కాంగ్రెస్ అన్ని స్థానాలకూ పోటీ చేస్తున్నాయి. టిడిపి ఏడు చోట్ల తన అభ్యర్థులను నిలపగా, ఎచ్చెర్ల సీటును మిత్రపక్షమైన బిజెపికి కేటాయించింది. వైసిపి, టిడిపి నుంచి ముఖ్యులు బరిలో నిలిచారు. ఆమదాలవలస స్థానం నుంచి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, శ్రీకాకుళం నుంచి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పలాస నుంచి పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పల రాజు, నరసన్నపేట నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పోటీలో ఉన్నారు. టిడిపి నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజ రాపు అచ్చెన్నాయుడు టెక్కలి నుంచి పోటీ పడుతున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

ఓటు హక్కు వినియోగించుకునే వచ్చే వారికి కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉండటంతో అన్ని పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు, పందిళ్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. చల్లదనం కోసం కూలింగ్ పరికరాలు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. వికలాంగుల కోసం ట్రైసైకిళ్లను అందుబాటులో ఉంచారు.

ఆదర్శం... ఈ పోలింగ్ కేంద్రాలు

ఎచ్చెర్లలో రెండు, పలాస, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున ఈ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

మహిళ: పింక్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు పూర్తిగా గులాబీ రంగులో తీర్చిదిద్దారు. ఎటు చూసినా గులాబీ రంగే కనిపించేలా వాతావరణం ఉంటుంది. ఈ మహిళా కేంద్రంలో మహిళలకు సంబంధించిన కొటేషన్లు, ఆడపిల్లల విద్య, ఆరోగ్యం, అక్షరాస్యత, వరకట్న వేధింపులు, రంగోలి వంటివి ప్రదర్శిస్తారు. ఈ కేంద్రాల్లో పూర్తిగా మహిళలే బాధ్యతలు నిర్వహిస్తారు. నియోజకవర్గానికి ఒక్కొక్కటి చొప్పున జిల్లాలో మొత్తం ఎనిమిది ఏర్పాటు చేశారు.

దివ్యాంగులు : దివ్యాంగుల కేంద్రాల్లో బ్రెయిలీ బ్యాలెట్ పేపర్, ఆటోల ద్వారా కేంద్రానికి తీసుకువచ్చి మళ్లీ దింపే ఏర్పాట్లు, సాక్ష్యం యాప్ ద్వారా సమాచారం, అదనంగా వీల్‌చైర్లు ఉండనున్నాయి. ఎచ్చెర్ల, పలాస నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు కూడా దివ్యాంగులే. వారే పోలింగ్ ప్రక్రియను నిర్వహిస్తారు.

ఆదర్శ : ఆదర్శ కేంద్రంలో క్లాత్ డెకరేషన్, బెలూన్లు, రెడ్ కార్పెట్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, సాయిమిత్ర (అర్బన్), పూలకుండీలు, ఓటరు నినాదాలు వంటివి, పూలతో అలంకరిస్తారు. ఇవి మొత్తంగా 31 ఉన్నాయి ఉన్నాయి. థిమాటిక్‌గా ఆకర్షణీయంగా వీటిని ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్లన్నింటినీ మొత్తం రంగురంగుల బెలూన్లతో అలంకరించారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
ఇచ్ఛాపురం	1,30,751	1,37,434	17	2,70,191
పలాస	1,07,278	1,12,049	21	2,22,379
టెక్కలి	1,17,816	1,18,502	9	2,39,262
పాతపట్నం	1,12,367	1,12,936	10	2,27,176
శ్రీకాకుళం	1,35,301	1,37,928	31	2,74,550
ఆమదాలవలస	96,179	97,664	15	1,96,102
ఎచ్చెర్ల	1,23,064	1,21,682	14	2,45,700
నరసన్నపేట	1,07,103	1,07,750	13	2,17,097
మొత్తం	**9,29,859**	**9,45,945**	**130**	**18,92,457**

తొలిసారి ఓటేస్తున్నారా..? అయితే ఇవి తెలుసుకోండి..!

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకు వచ్చే అతిపెద్ద పండగ ఓటు. అటువంటి పండగలో ఓటు హక్కును విధిగా వినియోగించుకోవడం పౌరునిగా మన కర్తవ్యం. తొలిసారి ఓటు వేసే వారికి ఈ ప్రక్రియ పూర్తిగా కొత్త. మీట నొక్కడమే కాదు, ఓటు ఎవరికి పడిందో నిర్ధారించుకునే హక్కు కూడా ఓటరుగా మన బాధ్యత. ఇంతకీ ఇవిఎంలో ఓటు ఎలా పడుతుందో, ఆ విధానమేమిటో ఇప్పుడు చూద్దామా...?. ఓటు వేసే ముందు పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించాక ఏం చేయాలో తెలుసుకుందామా..?.

ఓటరు చీటీ, ఏదైనా గుర్తింపు కార్డుతో పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించాక, మొదట పోలింగ్ అధికారి-1 వద్దకు వెళ్లాలి. ఓటరు వివరాలను ఆ అధికారి తన వద్ద ఉన్న ఓటర్ల జాబితాలో పరిశీలిస్తారు. ఓటరు పేరు, జాబితాలో వరుస సంఖ్యను బిగ్గరగా చదువుతారు. ఆ కేంద్రంలో పార్టీల వారీగా ఉన్న పోలింగ్ ఏజెంట్లు ఆ ఓటరు పేరు, నంబరును తమ వద్ద ఉన్న ఓటరు జాబితాలో సరిచూసుకుంటారు.

అనంతరం పోలింగ్ అధికారి-2 వద్దకు ఓటరు వెళ్లాలి. అతని వద్ద ఉన్న స్లిప్పులోని వివరాలను ఆ అధికారి తన వద్ద ఉన్న రిజిస్టర్‌లో సరిచూసుకుని, సంతకం తీసుకుంటారు. ఒకవేళ ఓటరు నిరక్షరాస్యులైతే వేలిముద్ర తీసుకుంటారు. ఎడమచేతి చూపుడు వేలిపై సిరా గుర్తు పెడతారు. శాసనసభ, లోక్‌సభ స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టి ఓటర్లకు ఎన్నికల అధికారులు రెండు



వేర్వేరు రంగుల స్లిప్పులు ఇస్తారు. వాటి ఆధారంగా రెండు బ్యాలెట్ యూనిట్లలో వారు ఓటు హక్కును వినియోగించుకుంటారు.

అక్కడ్నుంచి పోలింగ్ అధికారి-3 వద్దకు వెళ్లాలి. ఆ అధికారి ఓటరు వద్ద ఉన్న చీటీని పరిశీలిస్తారు. తన వద్ద ఉన్న కంట్రోల్ యూనిట్‌లో మీట నొక్కి, ఓటును విడుదల చేస్తారు. (ఓటు రిలీజ్ చేయకముందు కంట్రోల్ యూనిట్‌పై ఎడమవైపు ఆకుపచ్చ రంగు ఎల్ఇడి బల్బు వెలుగుతూ ఉంటుంది. ఓటు రిలీజ్ చేశాక కుడివైపు రెడ్ లైట్ వెలుగుతుంది. దీన్ని ఓటరు చూడవచ్చు.)

ఇవిఎంలో ఓటు ఎలా పడుతుందంటే...

ఆ తర్వాత బ్యాలెట్ యూనిట్ వద్దకు ఓటరు వెళ్లాలి. ఈ యూనిట్ పైభాగంలో ఆకుపచ్చని ఎల్ఇడి బల్బు వెలుగుతూ ఉంటుంది. బ్యాలెట్ యూనిట్‌పై అతికించిన బ్యాలెట్ కాగితంపై తాను ఓటు వేయాలని నిర్ణయించుకున్న అభ్యర్థి పేరు పక్కనే ఉన్న మీటను నొక్కాల్సి ఉంటుంది. మీటను నొక్కగానే, దాని పక్కనే ఉన్న బాణం గుర్తులో రెడ్ కలర్ లైటు వెలుగుతుంది. బీప్ సౌండ్ వస్తుంది. బ్యాలెట్ యూనిట్‌పై ఉన్న గ్రీన్ కలర్ లైటు ఆగిపోతుంది. బ్యాలెట్ యూనిట్‌పై సమీపంలోనే ఉన్న వివి ప్యాట్ యంత్రంలో ఒక స్లిప్ కనిపిస్తుంది. అందులో ఓటరు ఓటు వేసిన పార్టీ సింబల్, అభ్యర్థి పేరు కనిపిస్తాయి. ఈ చీటీ ఏడు క్షణాల పాటు కనిపిస్తుంది. ఆ తర్వాత దానికి అమర్చిన డబ్బాలో పడిపోతుంది. దాన్ని పరిశీలించి, తాను వేసిన ఓటు సరిగ్గా పడిందా, లేదా అన్నది ఓటరు నిర్ధారించుకోవచ్చు. లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు ఏకకాలంలో ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టి రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు వేర్వేరుగా ఓటు వేయాల్సి ఉంటుంది.

నెరవేరని 'వంశధార' వాగ్దానం

- పదేళ్లు కావస్తున్నా పూర్తి కాని వంశధార స్టేజ్-2 ఫేజ్-2 పనులు
- ప్రతి ఎకరాకూ సాగునీరంటూ ప్రగల్భాలు
- చెరో ఐదేళ్లు కాలక్షేపం చేసిన వైసిపి, టిడిపి
- సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామంటూ మరోసారి హామీలు


అసంపూర్తిగా హిరమండలంలోని వంశధార రిజర్వాయర్ పనులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రతి ఎన్నికల్లో చెప్పుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలకు వంశధార ప్రాజెక్టు ఒక ప్రచార అంశంగా మారిపోయింది. సిఎం హోదాల్లో జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు వంశధారను పూర్తి చేసి ప్రతి ఎకరాకూ సాగు నీరందిస్తామంటూ హామీలు గుప్పించడం పరిపాటిగా మారిపోయింది. ఐదేళ్లు కాలక్షేపం చేసి, ఆ తర్వాత ప్రతిపక్ష నాయకులుగా వారే జిల్లాకు వచ్చిన సందర్భాల్లో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామంటూ వాగ్దానాలు చేస్తున్నారు. వంశధార ప్రాజెక్టును 2006లోనే ప్రారంభించినా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సిఎంలను మార్చడం, రాష్ట్ర విభజన వంటి అంశాలతో అర్థాంతరంగా ఆగిపోయింది. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లో పనులు పున: ప్రారంభించారు. పనులు పూర్తి చేయడానికి వారికి మూడేళ్లు చాల్లేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఐదేళ్లలో పూర్తి చేయలేక తన వైఫల్యాన్ని చాటుకుంది.

వంశధార ఫేజ్-2 స్టేజ్-2 ప్రాజెక్టు పనులకు రూ.933.90 కోట్లతో 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. ప్రాజెక్టు పనులను 87, 88 ప్యాకేజీలు, హిరమండలం రిజర్వాయర్ పనులుగా విభజించారు. 87 ప్యాకేజీ పనులను హర్విన్ కన్‌స్ట్రక్షన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌కు, 88 ప్యాకేజీ పనులను శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్‌కు, హిరమండలం రిజర్వాయర్ పనులను సోమ-పటేల్ కంపెనీకి అప్పటి ప్రభుత్వం అప్పగించింది. 2008 జూలై నాటికి 87 ప్యాకేజీ పనులు 31 శాతం, 88 ప్యాకేజీ పనులు 36 శాతం పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం, ప్రాజెక్టు పనుల అంచనాలను రూ.1616.23 కోట్లకు పెంచింది. 2019 వరకు 87 ప్యాకేజీ పనులు 64 శాతం, 88 ప్యాకేజీ పనులు 81 శాతం, హిరమండలం రిజర్వాయర్ పనులు 87 శాతం పూర్తయ్యాయి. ఇప్పటివరకు రూ.1650.20 కోట్లను ఖర్చు చేశారు.

ఐదేళ్లలోనూ జరిగిన పనులు స్వల్పమే...

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమారు ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.2,671.52 కోట్లకు పెంచారు. ఐదేళ్ల కాలంలో నిర్మాణ పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. వీటిలో 87 ప్యాకేజీ పనులు 90 శాతం పూర్తయ్యాయి. లైనింగ్ పనులకు సంబంధించి ఇప్పటివరకు 7.63 కిలోమీటర్లు పూర్తి కాగా, మరో 3.83 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. అండర్ పాసేజ్‌లు, వంతెనలు తదితర నిర్మాణాలు 25 వరకు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 24 నిర్మించారు. 88 ప్యాకేజీ పనులు 94 శాతం పూర్తయ్యాయి. లైనింగ్ పనులకు సంబంధించి ఇప్పటివరకు 16.6 కి.మీ పూర్తి కాగా, మరో 1.19 కి.మీ మేర లైనింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. అండర్ పాసేజ్‌లు, వంతెనలు తదితర నిర్మాణాలు 37 వరకు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 36 నిర్మించారు. హిరమండలం రిజర్వాయర్ పనుల అంచనా వ్యయం రూ.419.03 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.376.31 కోట్లను వెచ్చించారు. ఇప్పటివరకు 94.5 శాతం పనులు పూర్తయ్యాయి.

పెండింగ్‌లో భూసేకరణ

వంశధార ప్రాజెక్టుకు సంబంధించి మరోవైపు భూసేకరణ కూడా పెండింగ్‌లో ఉంది. 87 ప్యాకేజీ కింద చేపడుతున్న కాలువ తవ్వకాలకు 71.32 ఎకరాల భూమి అవసరం. అధికారులు ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసినా, సంబంధిత రైతులకు రూ.9.20 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు విడుదల చేయకపోడంతో, కాలువ తవ్వకాలు ముందుకు సాగడం లేదు. అదేవిధంగా 88 ప్యాకేజీ కింద చేస్తున్న కాలువ పనులకు 20.16 ఎకరాలు కావాల్సి ఉంది. రైతులకు రూ.2.92 కోట్లు చెల్లించాల్సి ఉంది.

రిజర్వాయర్‌లో నీళ్లు లేవు... ఇచ్ఛాపురానికి నీరు

ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండుసార్లు జిల్లాకు వచ్చిన టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వంశధార ప్రాజెక్టుపై పాత పాటే పాడారు. వంశధార ప్రాజెక్టును వైసిపి ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందంటూ పలాస, పాతపట్నం ప్రజాగళం సభల్లో చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి వస్తే వంశధార, బాహుదా నదులను అనుసంధానం చేసి, ఇచ్ఛాపురానికి సాగునీరందిస్తామన్నారు. అసలు రిజర్వాయర్‌లోనే నీళ్లు లేకపోతే, ఇచ్ఛాపురానికి సాగునీరు ఎలా ఇస్తారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. టిడిపి అధికారంలోకి వస్తే ఖర్చులు పెరిగాయనే పేరుతో, అంచనా వ్యయం పెంచే అవకాశాలూ లేకపోలేదనే చర్చ అధికారిక వర్గాల్లో సాగుతోంది. అంచనాలు పెంచడం, ఐదేళు సాగదీయడం పాలకులకు ఇదే అలవాటుగా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రాజెక్టుల ఊసే ఎత్తని సిఎం జగన్మోహన్‌రెడ్డి

మేమంతా సిద్ధం సభ యాత్రలో పాల్గొనేందుకు గత నెల 24న టెక్కలి, ఈనెల ఏడో తేదీన ఇచ్ఛాపురం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు, వంశధార ప్రాజెక్టులపై కనీస ప్రస్తావనే లేదు. సంక్షేమ పథకాలు, ప్రతిపక్షంపై విమర్శలు తప్ప జిల్లాకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడలేదు. సాధారణ రోజుల్లో జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు మాత్రం వంశధార, ఆఫ్‌షోర్ పూర్తి చేస్తామని, ప్రతి ఎకరాకూ సాగునీరిస్తామంటూ హామీలు ఇచ్చారు. ఐదేళ్ల వైసిపి హయాంలో మాత్రం వంశధార ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారు.

మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- పొందూరు


పైడిలింగం (ఫైల్)

పొందూరు మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, ఖాధీ వస్త్ర వ్యాపారి, ప్రముఖ దాత కాకర్ల పైడి లింగం (81) ఆదివారం ఉదయం మృతి చెందారు. ఈయన సర్పంచ్‌గా 2006 నుంచి 2011వరకూ పనిచేశారు. ఈయనకు ముగ్గురు కుమారులు కాగా పెద్దకుమారుడు రాజారావు ప్రస్తుతం శ్రీశైలం దేవస్థానం దేవాంగ సత్రం డైరెక్టర్‌గా ఉన్నారు, అలాగే మాజీ మండల ఉపాధ్యక్షునిగాను, లయన్స్ క్లబ్ మాజీ చైర్మెన్‌గా వ్యవహరించారు. మృతుని పెద్దకోడలు చెల్లమాంబ ప్రస్తుతం మండల ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. మృతుడు పైడిలింగం ప్రయివేటు రంగంలో ఖాదీ వస్త్రాలను ఉత్పత్తి చేపడుతూ సుమారు 40 గ్రామాల్లో వందలాది మంది నేత కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్నారు. పైడిలింగం మృతితో పొందూరులో విషాదఛాయలు అలముకున్నాయి. ఈయన మృతికి పలువురు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అనారోగ్యంతో సర్వేయర్ మృతి

ప్రజాశక్తి- బూర్జ


మహేష్ (ఫైల్)

అనారోగ్య కారణంగా మండల సర్వేయర్ ఆదివారం మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లక్కుపురం గ్రామానికి చెందిన చింత మహేష్ (38) విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండల సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. శనివారం అనారోగ్యానికి గురయ్యారు. అయితే ఆదివారం చికిత్స కోసం శ్రీకాకుళం తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మహేష్‌కు భార్య స్వాతితో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. మహేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న మహేష్ ఇలా అనారోగ్యంతో మృతి చెందడం తమకు తీవ్రమైన ఆవేదనకు గురి చేసిందని గ్రామస్తులు తెలిపారు.


మద్యం స్వాధీనం చేసుకున్న ఎస్ఇబి పోలీసులు

భారీగా మద్యం పట్టివేత

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర వంశధార నది తీరం వద్ద ఆదివారం భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నారని ఎస్ఇబి ఎఎస్‌పి ఐ.ఎ.బేగం తెలిపారు. మద్యం నిల్వ ఉన్నట్లు అపరిచిత వ్యక్తి ఇచ్చిన సమాచారంతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ గంగధర ఆదేశాలు మేరకు ఎస్ఇబి సిఐ జయరామిరెడ్డి, ఎస్ఐ శ్రావణిలు నది పరిసరాల్లో తనిఖీ నిర్వహించారని అన్నారు. నది ఒడ్డున ఓ గుమ్మిలో తాటి కమ్మలు కప్పి అందులో మద్యం నిల్వ ఉంచినట్లు తెలిపారు. వాటిని తొలగించి రూ.3.45 లక్షలు విలువైన 40 మద్యం పెట్టెలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

పోలాకి: తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి అవుతుందని ఒబిసి రాష్ట్ర అధ్యక్షులు అన్నెపు వరప్రసాద్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి తులసిపాటి కృష్ణంరాజు అన్నారు. మండలంలోని రాళ్లపాడులో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి హయాంలో రాష్ట్రాభివృద్ధి వెనుకబడిందని అన్నారు. టిడిపి ఒబిసి రాష్ట్ర సంఘం మద్దతు ప్రకటించిందిన తెలిపారు.


రాళ్లు తేలిన కొత్తఅగ్రహారం-జడ్యాడ రోడ్డు

రోడ్డు ఇలా... ప్రయాణం ఎలా?

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రయాణం ఎలా అని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని కొత్తఅగ్రహారం-జగ్గయ్యడ, పెంట పూరు-శివరాంపురం, నరేంద్రపురం-వల్లభనేనిపేట, కర్లపూడి-రాంపురం, నౌగాం-మదనాపురం, హర్షబడా-హీరాపురం ఇలా పలు రహదారులు గోతులతో రాళ్లు తేలిపోయాయి. దీంతో అవస్థలు తప్పడం లేదు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన రోడ్లను నిర్మించాలని కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సకల సౌకర్యాలు

- వేసవి తీవ్రతను తట్టుకునేలా ఏర్పాట్లు
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పోలింగ్ కేంద్రాల వద్ద వేసవి తీవ్రతను తట్టుకునేలా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. జిల్లాలోని 2,358 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. 'ఓటరును వదిలివేయబడకూడదు' అన్న ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓటరుకు ఎటువంటి అసౌకర్యం, అవాంతరాలు లేకుండా ఓటు వేయడానికి వీలుగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో అత్యుత్తమ సౌకర్యాలను అందిస్తున్నట్లు వివరించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సాధారణ ఓటర్లు, సీనియర్ సిటిజన్లు, పిడబ్ల్యుడి ఓటర్లు అవసరాలకు తగిన విధంగా ర్యాంపులు, తాగునీరు, టెంట్లు, టేబుళ్లు, కుర్చీలు, బెంచీలు, విద్యుత్, మరుగుదొడ్లు, వైద్య బృందాలు తదితర ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. క్యూ లైన్లు, ఓటరు సహాయ బూత్‌లు ఉన్నట్లు తెలిపారు.

పిడబ్ల్యుడి ఓటర్లకు వీల్‌చైర్లు, ప్రత్యేక క్యూలైన్లు, రవాణా సౌకర్యం కోసం వాహనాలు, సీనియర్ సిటిజన్లు, విజువల్, లోకోమోటివ్ వైకల్యాలు ఉన్న వ్యక్తులు, బలహీనమైన కదలికతో బాధపడుతున్న ఓటర్లకు సహాయం చేయడానికి ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు, భద్రతకు సిఆర్‌పిఎఫ్, ఎస్ఎపి, పోలీసులను మోహరించినట్లు వివరించారు.

వేసవి నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో వడగాలుల ప్రభావాన్ని తగ్గించడానికి, ఓటర్ల భద్రత కోసం ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, వికలాంగుల కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు, పందిరి, గొడుగులు, కుర్చీలు, ఫ్యాన్లు, మిస్టింగ్ ఫ్యాన్లు వంటి కూలింగ్ పరికరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైద్య బృందాలు, పారా మెడికల్ సిబ్బందితో మొబైల్ యూనిట్లు ఉన్నాయన్నారు. డీహైడ్రేషన్ నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఓటర్లు తడి తువ్వాళ్లను తీసుకెళ్లాలని సూచించారు. మహిళా ఓటర్లు తమతో పాటు పిల్లలను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావద్దని కోరారు.

ఓటర్లందరూ పోలింగ్ సమయాల్లో ఎన్నికల సంఘం ఆమోదించిన ఏదైనా గుర్తింపు కార్డుతో పాటు సంబంధిత పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కుల, మత, ఇతర ప్రలోభాలకు గురికావద్దన్నారు. ఓటు కోసం లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమన్నారు.



కంట్రోల్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్










పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం



పరిశీలిస్తున్న అధికారులు







పలాసలో ధ్వంసమైన టెంట్లు



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. పోలింగ్ పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. జిల్లాలో పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర పారామిలటరీ, ఎపిఎస్‌పి బలగాలతో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల వరకు 144 సెక్షన్ విధించారు. 144 సిఆర్‌పిసి సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురుకు మించి ఎక్కువ మంది ఒకచోట గుమిగూడి ఉండకూడదు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు, విజయనగరం పార్లమెంట్ నియోజకవరం పరిధిలోని ఎచ్చెర్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో జరగనున్న ఎన్నికల కోసం 2,358 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు పోలింగ్ నిర్వాహణకు నియమించిన సిబ్బంది నియోజకవర్గ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రితో ఆదివారం మధ్యాహ్నం బయలుదేరి వెళ్లారు. శ్రీకాకుళం ఆర్స్ కళాశాలలో శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన పిఒ, ఎపిఒ, నలుగురు ఒపిఒలు ఇతర సిబ్బంది ఎన్నికల సామగ్రితో బయలు దేరారు. వారి కోసం ప్రత్యేక బస్‌లను ఏర్పాటు చేశారు. అలాగే మిగిలిన ఏడు నియోజకవర్గ కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు.





సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది



ఇవిఎంలను తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది











షార్ట్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు







బస్సుల్లో వెళ్తున్న సిబ్బంది



సిద్ధంగా ఉన్న ఆర్‌టిసి బస్సులు



ఇవిఎంలు



ఇవిఎంలను భద్రపరుస్తున్న సిబ్బంది



బస్సు ఎక్కుతున్న సిబ్బంది



ఇబిఎంలను తీసుకెళ్తున్న సిబ్బంది



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

అన్నదాతలంటే అలుసు

- ఏటా అందని సాగునీరు
- మరమ్మతులకు నోచుకోని ఛానళ్లు
- చోద్యం చూస్తున్న అధికారులు

దేశానికి, రాష్ట్రానికి వెన్నెముక రైతన్నలే అని ఊకదంపుడు ఉపన్యాసాలకే పరిమితం తప్ప ఆ రైతులకు అవసరమైన కనీస అవసరాలు కూడా తీర్చలేని పరిస్థితులు ఉన్నాయి. అన్నదాతలు పండించే పంటలకు అవసరమైన సాగునీరు అందించేందుకు అటు పాలకులు, ఇటు అధికారులు చొరవ చూపిన పాపాన పోలేదు.

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అన్నదాతలు ప్రతి ఏడాది అవసరమైన సాగునీరు అందక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మొదట్లో శివారు భూముల వరకు సాగునీరు అందిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నారు తప్ప ఆదిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో నాగావళి నది ద్వారా సాగునీరు



నీలంపేట వద్ద శిథిలావస్థకు చేరుకున్న చప్టాలు



బూర్జ, వావాం మధ్య పిచ్చిమొక్కలతో ఓపెన్‌హెడ్ ఛానల్

అందించేందుకు మండలంలో ఆరు ఓపెన్ హెడ్ ఛానల్స్ ఏర్పాటు చేశారు. నదీతీర గ్రామాలైన బూర్జ, మామిడివలస, అల్లెన, లంకాం, లాభాం గ్రామాలతో పాటు దేశాయ్ ఓపెన్ హెడ్ ఛానల్ ద్వారా సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేశారు. అయితే ఈ ఓపెన్ హెడ్ ఛానల్ ద్వారా మండలంలో సుమారు 120 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ప్రస్తుతం గత ఎనిమిదేళ్లుగా ఓపెన్ హెడ్ ఛానళ్లు మరమ్మతులకు గురయ్యాయని, ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయని రైతులు తెలిపారు. ఛానల్లో పూడికలు పేరుకుపోవడంతో సకాలంలో సాగునీరు అందడం లేదని రైతులు తెలిపారు. దశాబ్ద కాలంగా తమకు సాగునీరు అందకపోవడంతో ప్రతి ఏడాది పంటలు నష్టపోతూనే ఉన్నామన్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విజ్ఞప్తి చేసుకున్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో రైతులకు అవసరమైన సాగునీరు అందజేస్తాం, చెక్‌డాంలు నిర్మిస్తాం, ఓపెన్ హెడ్ ఛానల్స్‌కు మరమ్మతులు జరిపిస్తామని ప్రకటనలు గుప్పించిన నాయకులు ఇంతవరకు పట్టించు కోలేదని రైతులు బహిరం గంగానే విమర్శలు గుప్పి స్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌కు రైతాంగం సిద్ధమవుతున్నామని అయితే ప్రతి ఏడాదిలా తమకు అవసరమైన సాగునీరు అందని పరిస్థితి ఎదురవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఓపెన్‌హెడ్ ఛానల్స్‌కు మరమ్మతులు జరిపి ఖరీఫ్‌కు అవసరమైన సాగునీరు అందించేందుకు కృషి చేయాలని మండల రైతులు కోరుతున్నారు.



సత్కరిస్తున్న వాకర్స్

వాకర్స్ ఆధ్వర్యాన మాతృ దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రేమకు ప్రతి రూపం అమ్మ అని, జన్మనిచ్చిన తల్లిని దైవ స్వరూపంగా భావించి కంటికి రెప్పలా కాపాడుకోవాలని స్టార్ వాకర్స్ ప్రతినిధులు జి. ఇందిరాప్రసాద్, పి జి గుప్తా, ఎస్.జోగినాయుడు అన్నారు. ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ వాకర్ ఎం. రాంబాయిని సత్కరించారు. ప్రతి మహిళ మాతృరూపమేనని, వారిని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గోలీ ఉమా మహేశ్వరరావు, ఎం.మల్లిబాబు, గోలీ సంతోష్, వి.వాసంతి లక్ష్మి, జి. లక్ష్మీ, పాలకొండ ప్రశాంత్ పాల్గొన్నారు..



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ దానేటి శ్రీధర్

సేవకు మారుపేరు నర్సులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సహనానికి, సేవకు మారు పేరు నర్సులు అని ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. ఆదివారం నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కట్ చేశారు. నర్సులందరికీ అంతర్జాతీయ నర్సులు దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. చెరగని చిరునవ్వుతో, రోగులతో ఆప్యాయంగా మాట్లాడుతూ వారిలో మనోధైర్యాన్ని నింపే నర్సింగ్ వృత్తి ఎంతో ఆదర్శవంతమైందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రాణాలకు తెగించి, కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ ఎందరో ప్రాణాలను నిలబెట్టింది నర్సులేనన్నారు. సమాజం వారికి ఎంతో రుణపడి ఉందన్నారు. కార్యక్రమంలో మెడికల్ హెచ్‌ఆర్ దిలీప్,డా.భాను, డా.ప్రశాంత్, డా. శ్యాం ప్రసాద్ డ్యూటీ డాక్టర్స్, స్టాఫ్ పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ఆమదాలవలస: పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ తమ్మినేని సీతారాం సమక్షంలో సరుబుజ్జిలి మండలం ఎల్‌పిఎం అగ్రహారంకు చెందిన 10 కుటుంబాలు వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో టిడిపి నుంచి వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి తమ్మినేని సీతారాం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ పార్టీ విధి విధానాలు నచ్చి ప్రభుత్వ పథకాల పట్ల ఆకర్షితులమై పార్టీలో చేరామని తెలిపారు.



పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న తమ్మినేని

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీసు సిబ్బందికి సూచించారు. ఆదివారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు, 33 రూట్లలో మొబైల్ పార్టీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల బందోబస్తు నిమిత్తం నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 11 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, 20 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 118 పోలీస్ కానిస్టేబుళ్లు, 11 మంది మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు, 35 మంది హోం గార్డులతో కలిపి మొత్తం 205 మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఎఎస్‌పి ప్రేమ కాజల్, డిఎస్‌పిలు వై.శృతి, విజయ్ కుమార్, సీఐ దివాకర్ యాదవ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌పి రాధిక

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఎటువంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్ తెలిపారు. నియోజకవర్గంలో 259 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో 1,93,858 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఆమదాలవలన, ఆమదాలవలస మున్సిపాలిటీ, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాలకు సంబంధించి సిబ్బంది మెటీరియల్ డంపింగ్ చేసేందుకు 33 రూట్లను ఏర్పాటు చేశామన్నారు. ఆయా రూట్లకు సంబంధించి రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన మెటీరియల్ పంపిణీ కేంద్రాలకు ఉదయం నుంచి పోలింగ్ సిబ్బంది చేరుకొని ఇవిఎంలు, మెటీరియల్స్‌ను తీసుకొని వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈ పంపిణీ కార్యక్రమాలను ఆర్‌ఒ, రెవెన్యూ అధికారులు పర్యవేక్షించారు.



ఇవిఎంతో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన ఎన్నికల సిబ్బంది

అరసవల్లిలో ఆదిశంకరాచార్య జయంతి

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో గల అనివేటి మండపంలో జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ వేడుకల్లో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఇప్పిలి నగేష్ శర్మలు పాల్గొని వేడుకలను నిర్వహించారు.

పెరిగిన రద్దీ

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో యాత్రికుల రద్దీ పెరిగింది. వైశాఖ మాసం తొలి ఆదివారం కావడంతో రద్దీ పెరిగింది. దీనివల్ల ఒక్క రోజునే ఆదాయం రూ.7.22లక్షల లభ్యమైనట్టు ఆలయ ఇఒ చంద్రశేఖర్ తెలిపారు. టికెట్లు విక్రయాల రూపంలో రూ.3,74,300, విరాళాల రూపంలో రూ.67,036, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,81,250 ఆదాయం సమకూరినట్టు ఆయన తెలిపారు.

పాడైన రహదారితో ప్రజల ఇబ్బందులు

పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం



గుంతలుగా మారిన రహదారి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని బొబ్బిలిపేట గ్రామానికి వెళ్లే రహదారి పాడై ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. సిఎస్‌పి ప్రధాన రహదారి నుంచి బొబ్బిలిపేట గ్రామానికి వెళ్లే సుమారు మూడు కిలోమీటర్ల రహదారి పాడై ఆరు గ్రామాల ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. సుమారు ఐదేళ్ల నుంచి రహదారి శిథిలమై గుంతలు గుంతలుగా మారి పాడైనప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోలేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మాజీ శాసన సభ్యురాలు బొడ్డేపల్లి సత్యవతి హాయంలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో సుమారు 12 ఏళ్ల క్రితం రహదారిని నిర్మించారని ఆ తరువాత కాలంలో టిడిపి హయంలో మరమ్మతులు చేసినప్పటికీ ఆ తరువాత కాలంలో రహదారి మళ్లీ గుంతలు గుంతలుగా ఏర్పడడంతో ప్రజల బాధలు మళ్లీ మొదటికి వచ్చాయి. ఇదే రహదారిపై నిత్యం నెల్లిపర్తి, గొల్లపేట, వెదుళ్లవలస, చింతలపేట, దండేవలస గ్రామాల ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. గుంతల రహదారిపై గమ్యస్థానాలకు చేరుకోవడానికి నానా ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు వాపోతున్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ రహదారికి మోక్షం కలగలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నూతన రహదారి నిర్మించి ప్రజలను కష్టాల నుంచి గట్టెక్కించాలని పలువురు కోరుతున్నారు.

నూతన రహదారి నిర్మించాలి



గడచిన కొన్నేళ్లుగా ప్రజా ప్రతినిధులు, అధికారులకు పలు మార్లు నూతన రహదారిని నిర్మించాలని విన్నవించినప్పటికీ పట్టించుకోలేదు. పలు గ్రామాల విద్యార్థులు, ప్రజలు ఇదే రహదారిపై రాకపోకలు కొనసాగిస్తుంటారు. వర్షాకాలంలో రహదారిపై గుంతలు తెలియక విద్యార్థులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు సమస్యను పరిష్కరించి ప్రజలను ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలి.

- కూన మోహిని, బొబ్బిలిపేట

ఎన్నికల సామగ్రి పంపిణీ


పలాస : సామగ్రిని తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

పలాసలో భారీ వర్షంతో కూలిన టెంట్లు

ప్రజాశక్తి- పలాస

పలాస జూనియర్ కళాశాలల క్రీడామైదానంలో సర్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద గందరగోళం నెలకొంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికల సిబ్బంది పడి గాపులు కాయాల్సి వచ్చింది. సాయంత్రం 6.30 గంటలకు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందితో పాటు సామగ్రిని తరలించారు. కొంత పలాస జూనియర్ కళాశాల క్రీడా మైదానం, మరి కొంత పలాస ఉన్నత పాఠశాల ఆవరణలో కౌంటర్లు ఏర్పాటు చేయడంతో ఎన్నిక విధుల్లో చేరేందుకు వచ్చిన ఎన్నికల సిబ్బంది ఇబ్బందులు పడ్డారు.

భారీ వర్షంతో అడ్డంకులు

మున్సిపాలిటీతో పాటు పలాస మండలంలో ఆదివారం వేకువజామున గాలితో కూడిన భారీ వర్షం కురిసింది. ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం ఏర్పాటు చేసిన టెంట్లు నెలకొరిగాయి. కూర్చీలు, టేబుళ్ల చెల్లా చెదురుగా పడ్డాయి. శనివారం రాత్రి రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అష్టకష్టాలు పడి ఏర్పాటు చేశారు. రాత్రి వీచిన గాలులు, వర్షానికి టెంట్లు నెలకొరగడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. ఆ స్థానంలో చేయాల్సిన పంపిణీ కార్యక్రమంతా ఉన్నత పాఠశాల ఆవరణలో ఎన్నికల సామగ్రి పంపిణీ జరిగింది.

37 మంది రూట్ అధికారుల నియామకం

పలాస నియోజకవర్గంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 37 సెక్టర్ అధికారులు, 37 రూట్ అధికారులను నియమించారు. 284 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. నియోజకవర్గంలో 2,19,348 ఓటర్లు ఉండగా, పురుషులు 1,07,278 మంది, మహిలలు 1,12,049 మంది, ఇతరులు 21 మంది ఓటర్లు ఉన్నారు.

37 రూట్లు... 64 బస్సులు

పలాస జూనియర్ కళాశాల నుంచి ఎన్నికలకు సంబంధించిన సిబ్బందితో పాటు సామగ్రి తరలించేందుకు 64 బస్సులు, 8 టాటా మెక్సీలు బస్సులు అధికారులు ఏర్పాటు చేశారు. అందులో 20 ఆర్‌టిసి బస్సులు , 36 బస్సులు ప్రయివేటు బస్సులు, 8 టాటా మాక్సీలు ఉన్నాయి. అయితే ఒక్కొక్క బస్సుకు ఆయా రూట్ పరిధిలో పోలింగ్ కేంద్రానికి సంబంధించిన సిబ్బందితో పాటు సామగ్రి తరలించేందుకు బస్సులు ఏర్పాటు చేసినా... కొన్ని బస్సుల్లో సీట్లు లేక ఎన్నికల సిబ్బంది నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరికొంత మంది సీట్లు లేనిదే తాము ప్రయాణం చేయమని చెప్పడంతో ఎన్నికల అధికారులు రిజర్వులో ఉన్న బస్సులను ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు

పలాస నియోజకవర్గం పరిధిలో 284 పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసులను బందోబస్తులను ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. భారీ బందోబస్తులో భాగంగా ఒక డిఎస్‌సి, ముగ్గురు సిఐలు, 8 మంది ఎస్‌ఐలు, 91 మంది ఎఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, 203 మంది కానిస్టేబుళ్లు, 213 మంది మాజీ సైనికులు, ఎన్‌సిసి, పది సిఆర్‌పిఎఫ్ బృందాలు ఉన్నాయి.


టెక్కలి రూరల్ : సామగ్రిని తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

1704 మంది ఎన్నికల నిబ్బంది

సార్వత్రిక ఎన్నికల్లో 1704 సిబ్బందిని నియమించినట్లు పలాస నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్ తెలిపారు. 284 మంది పిఒలు, 284 మంది ఎపిఒలు, 1136 మంది ఒవిలు అదనంగా సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

టెక్కలి రూరల్ : సార్వత్రిక ఎన్నికలు సోమవారం జరగనున్న నేపథ్యంలో పక్కాగా అన్ని ఏర్పాట్లు అధికారులు చేపట్టారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను తెరిచిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ ఇవిఎం, వివి పాట్లు, ఇతర సామగ్రిని అందజేశారు. ఇవిఎంల్లో బ్యాటరీ శాతాన్ని పరిశీలించుకొని సిబ్బంది సామగ్రిని తరలించారు. అబ్జర్వర్ సందీప్ కుమార్ ఈ ఏర్పాట్లు ప్రక్రియను ఆర్‌ఒతో కలిసి పరిశీలించారు. టెక్కలి నియోజకవర్గ పరిధిలో 315 గాను, 35 రూట్లుగా విభజించి పోలింగ్ కేంద్రాల పరిధిలో 280 మంది మైక్రో అబ్జర్వర్లనూ నియమించారు. 315 మంది పిఒలు, 315 మంది ఎపిఒలు, 1,260 మంది సిబ్బందితో పాటు వెయ్యి ఓట్లు అదనంగాని పోలింగ్, బూత్‌లకు అదనపు సిబ్బందిని నియమించారు. ఈ ఏర్పాట్లు ప్రక్రియను అడిషనల్ ఎస్‌పి ప్రేమకాజోల్ తన సిబ్బందితో పరిశీలించారు. డిఆర్‌డిఎ పీడీ శాంతిశ్రీ ఎన్నికల సిబ్బందికి సంబంధించిన సమాచారాన్ని అందజేశారు.


వివరాలు తెలుసుకుంటున్న సుధీర్‌కుమార్

ఎన్నికల సామగ్రి పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి- పలాస

వలాస జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులు సుధీర్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. కూలిపోయిన టెంట్లను, చెల్లా చెదురైన కూర్చీలను వరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీలో ఎటువంటి చర్యలు చేపడుతున్నారు... ఇప్పటి వరకు ఎన్నికల సామగ్రి పంపిణీ ఎంతవరకు వచ్చింది... ఎన్నికల సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించారా? లేదా? భోజన ఏర్పాట్లు తదితర అంశాలను ఆర్‌డిఒ భరత్ నాయక్ అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు లేకుండా సామగ్రిని పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆదివారం వేకువజామున ఈదురగాలులతో పాటు భారీ వర్షం కురవడంతో టెంట్లు నేలమట్టమయ్యాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి- పలాస

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా చర్యలు ఉంటాయని కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరెరెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. కాశీబుగ్గ ప్రయివేటు కళ్యాణ మండపంలో పోలీసు అధికారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కువ మంది ఉండకుండా చూసుకోవాలన్నారు. ఏ పార్టీ నాయకులకు పోలింగ్ కేంద్రాల వద్దకు రాకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలన్నారు.

పోలింగ్ ఏర్పాట్లు పూర్తి


ఇచ్ఛాపురం : ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్దా ఓటర్లకు ఎండ తీవ్రత లేకుండా టెంట్లు ఏర్పాటు చేశారు. రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వల్ల ఓటర్లకు పోలింగ్ రోజు క్యూ లైన్లలో నిలబడి ఇబ్బందులు లేకుండా టెంట్లు ఏర్పాటు చేశారు. వృద్ధులకు, వికలాంగులకు పోలింగ్ కేంద్రం నుంచి ట్రై సైకిల్ ద్వారా ఓటింగ్‌కి తీసుకుని వెళ్లేందుకు ర్యాంపులు సిద్ధం చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మొత్తం 299 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఇచ్ఛాపురం అర్బన్ 30, రూరల్‌లో 53, కవిటి మండలంలోని 70, కంచిలి మండలంలో 67, సోంపేట మండలంలో 79 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 2,68,202 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,30751, మహిళలు 1,37,434 మంది, జండర్ ఓటర్లు 17 మంది ఓటర్ల ఉన్నారు. అధికార యంత్రాంగం వంద శాతం పోలింగ్‌కు కృషి చేస్తున్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో అధికారులు పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామని తహశీల్దార్ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎం మిసన్లతో ఏర్పాట్లు, లైట్లు, ఫ్యాన్లతో పాటు ఓటర్లకు తాగునీటి సదుపాయాలను సిద్ధం చేశామన్నారు. క్యూలైన్లలో ఉన్న ఓటర్లు ఎండలో ఉండకుండా టెంట్లు చేశామని తెలిపారు. సంతబొమ్మాళి మండలంలో 34 పంచాయతీల్లో 73 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం ఓటర్లు 60,095 ఉన్నారని, అందులో 30,160 మంది పురుషులు, 29,933 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. పోలింగ్ బూత్‌లో ఏదైనా సాంకేతిక సమస్యలు, విద్యుత్ సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించామని తెలిపారు.


నౌపడ : పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది


స్లిప్పులు అందక ఇబ్బందులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలం పరిధిలోని చాలామందికి ఓటర్లు స్లిప్పులు అందలేదు. దీంతో పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి స్లిప్పులు తెచ్చుకుంటున్నారు. పోలింగ్ ముందు రోజు వరకు ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయకపోవడంతో అధికార యంత్రాంగం పనితీరుపై ఓటర్లు మండిపడుతున్నారు. నోటిఫికేషన్ జారీ నుంచి ఎన్నికల కమిషన్ అదేశాలతో యంత్రాంగం వంద శాతం పోలింగ్‌పై దృష్టిసారించారు. గ్రామాలు, వార్డులుల్లో అనేక అవగాహనా సదస్సులు నిర్వహించి నిర్వహించి ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యత గురించి వివరించారు. అంతా బాగానే ఉన్నా పోలింగ్ తేదీ ముందు రోజు అనగా ఆదివారం సాయంత్రం వరకు చాలా మంది ఓటర్లకు స్లిప్పులు అందకపోవడంతో పలు ఇబ్బందులు పడ్డారు. అవకాశం ఉన్న వారు మొబైల్ ఫోన్‌లో డౌన్‌డోన్ చేసుకున్న కొంత మంది పోలింగ్ కేంద్రాలు వద్దకు పరుగులు తీశారు. ఓటర్లకు పోలింగ్ ముందు రోజు స్లిప్పులు అందించాల్సిన బాధ్యత ఎన్నికల పర్యవేక్షణ చేస్తున్న అధికార యంత్రాంగానిది. కానీ, ఆదివారం సాయంత్రం వరకూ స్లిప్పులు అందించలేదు.


స్లిప్పులు అందిస్తున్న సిబ్బంది

మత్స్యకారులను ఆదుకునేదెప్పుడు?


మృతి చెందిన మత్స్యకారుడు (ఫైల్)

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ప్రతి మనిషీ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటే చేపలు, రొయ్యలు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. కానీ, కెరటాలు ఎదురొడ్డి చేపలు, రొయ్యలు వేటాడే మత్స్యకారుల బతుకులు చూస్తుంటే ఆరోగ్యం అటుంచి.. మరీ దయనీయ స్థితిలో ఉన్నారు. చేపల వేట సమయంలో మృత్యువాత పడుతున్నా... ఆదుకోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఈ ఏడాదిలో గార మండలం బందరువానిపేటకు చెందిన పుక్కళ్ల లక్షుమయ్య, గుంటు గణపతిరావు, కపాసుకుద్దికు చెందిన బడే డిల్లేసు ఒకే రోజు వేటకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. అలాగే పోలాకి మండలం గుప్పిడపేటకు చెందిన సిరిగిడి కామయ్య వేటకు వెళ్లి చనిపోయారు. సోంపేట మండలం ఇసకలపాలెంకు చెందిన కోనేరు లోకేష్ వేట కోసం చెన్నయ్ వెళ్లి దుండగులు చేతిలో హత్యకు గురయ్యారు. ఇలా ఎక్కడో ఒకచోట మృతి కబురు వినిస్తునే ఉంది. అత్యంత భయంకరమైన, ప్రాణాంతకమైన వృత్తి చేపల వేట. జిల్లాలో 191 కిలో మీటర్లు తీర ప్రాంతంలో మత్స్యకారులకు సరైన వసతులు, జెట్టీలు, హార్బర్లు లేక జీవనోపాధి కోసం వేరే రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారు. పశ్చిమబెంగాల్, ఒడిశా, కేరళ, తమిళనాడు, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర, గుజరాత్, అండమాన్ తీర ప్రాంతాలకు పొట్టకూటి కోసం ఏటా సుమారు 40 వేలపైన వలస వెళ్తుంటారు. వీరిలో సంవత్సరం మొత్తం మీద సుమారు 30 మంది పైగా చనిపోతున్నారు. భాష రాక కొందరు తప్పిపోతున్నారు. ఏ ప్రభుత్వమూ ఇప్పటి వరకు ఎక్స్‌గ్రేషియా గాని, ఆదుకోవడం గాని చేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వాలు స్పందించి మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. అలాగే అంత్యక్రియలకు ఆర్థియసాయం అందించాలని, మృతుల పిల్లలకు కేంద్రాయ విద్యార్థుల్లో చదివించాలని కోరుతున్నారు.

జీడి రైతుకు భరోసా లభించేనా?

దక్కని 'మద్దతు' ధర

జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కోసం ఏడాదిపైగా పోరాటం కొనసాగిస్తున్న రైతులకు 'మద్దతు' కరువవుతోంది. జీడిపంటకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ లక్షమంది రైతులు సంతకాలు చేసి గతేడాది డిసెంబర్‌లో జీడి రైతుల సంఘం సభ్యులు ముఖ్యమంత్రికి అందించారు. ఆ తరువాత ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి స్వయంగా తమ సమస్య వివరించారు. అయినా ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ మాత్రం లభించలేదు. కనీసం మేనిఫెస్టోలో అయినా జీడి రైతుకు మద్దతు లభిస్తుందని ఆశిస్తే అక్కడా వీరికి నిరాశే మిగిలింది. మరోవైపు ఇటీవలే పలాస వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జీడి రైతును ఆదుకుంటామనే చెప్పారు. అయినా మద్దతుపై మాట్లాడలేదు. దీంతో కొన్ని వేల కుటుంబాలకు ఆధారమైన పంటపై, దాని కోసం పోరాడుతున్న తమపై రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై రైతులు, రైతు సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓట్లు అడగడానికి వస్తున్న నాయకులకు తమ పాట్లు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి- కవిటి

పలాస, వజ్రపు కొత్తూరు, మందస, కవిటి, కంచిలి, సోంపేటతో పాటు జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో జీడి పంట సాగవుతోంది. దీనిపై ఆధారపడి ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 80వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. ఐదేళ్ల క్రితం రూ.14వేలు పలికిన 80 కేజీల జీడిపిక్కల బస్తా నేడు రూ.7,500 నుంచి 8,500 మధ్య ఊగిసలాడుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఎకరాకు సుమారు రూ.30వేలు పెట్టుబడి పెట్టి పంట పండించిన జీడి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉన్నది ఒదులుకోలేక, ఉపాధి కోసం వలసపోలేక ఉక్కిరిబిక్కిరౌతున్నాడు.

అరచేతిలో స్వర్గం చూపిస్తున్న ప్రభుత్వాలు

మేరా భారత్ మహాన్, మేకింగ్ ఇండియా అంటూ ఊదరగొట్టే కేంద్ర ప్రభుత్వం స్వదేశీ పంటైన జీడిపై సీత కన్నేసింది. స్వదేశంలో పండుతున్న జీడిని ప్రోత్సహిస్తూ విదేశాల నుంచి దిగుమతి అవుతున్న పిక్కలు, పప్పుపై నియంత్రణ విధించాల్సింది పోయి వారికి నామమాత్రపు పన్ను విధిస్తూ స్థానిక రైతుల నోట్లో మట్టి కొడుతోంది. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న జీడిపిక్కలు, పప్పుపై నామమాత్రంగా కేవలం రూ.2.5 శాతం పన్ను విధించి, ఇబ్బడి ముబ్బడిగా విదేశీ పిక్కలు దేశంలోకి దిగుమతి జరిగేలా ప్రోత్సహించి జీడి రైతులను నడిరోడ్డుపై నిలబెట్టింది. మరోవైపు యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ అంటూ వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి టిటిడిలో నిత్యం టన్నుల కొద్ది వాడే జీడిపప్పును ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసి రాష్ట్రంలో ఉన్న రైతాంగానికి మొండి చేయి చూపారు.

నిలువునా దోచేస్తున్నారు

మరోవైపు ఆరుగాలం కష్టపడి రైతు సేకరించిన పంటను దళారీలు, వ్యాపారులు నిలువునా దోచేస్తున్నారు. తమవద్ద కొన్న జీడిపిక్కల ద్వారా ఉత్పత్తి చేసిన పప్పును వివిధ గ్రేడులు చేసి కేజీ రూ.600 నుంచి రూ.1000 వరకు అమ్మిన వ్యాపారులు తమకు మాత్రం 80 కేజీల బస్తాకు రూ.8వేలు మాత్రమే ఎలా ఇస్తారని వాపోతున్నాడు. అంతేకాకుండా 80 కేజీలకు అదనంగా 2 కేజీలు తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. వ్యాపారులు ఎప్పటికప్పుడు జీడిపప్పు రేటు తగ్గిందని చెబుతున్నా మార్కెట్‌లో కేజీ రూ.600కి తగ్గడం లేదని, నాసిరకం పప్పురేటును నాణ్యమైన పప్పుకు అన్వయించి వ్యాపారులు తమను మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచంలో ఏ సంస్థ, వ్యక్తి తాము ఉత్పత్తి చేసే వస్తువుకు తామే ధర నిర్ణయించి మార్కెట్టును శాసిస్తున్న ప్రస్తుత



రోజుల్లో ప్రపంచానికి ప్రాణం పోస్తున్న రైతాంగానికి మాత్రం ఎందుకు ఆ అవకాశం ఇవ్వడం లేదని జీడి రైతు మదనపడుతున్నాడు.

స్పందించని ప్రభుత్వం

ఏడాదికిపైగా రైతులు, రైతు సంఘాలు జీడి పంటకు గిట్టుబాటు ధర కోసం పోరాడుతుంటే ఇప్పటి వరకూ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. చివరికి ఇచ్ఛాపురం వచ్చిన ముఖ్యమంత్రి కూడా ఈ విషయంపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. స్వయంగా మంత్రి ఇలాఖాలోనే రైతుకు ఎండనకా, వాననకా పోరాటం చేసినా గాలి మాటలు చెప్పి ఊరుకున్నారే తప్పా రైతులకు ఊరట కలిగించే ప్రయత్నం ఒక్కటీ లేదు. ఇటువంటి పరిస్థితుల్లో రాబోయే ఎన్నికల్లో దీని ప్రభావం స్పష్టంగా కనిపించే పరిస్థితి కనిపిస్తోంది.

'మద్దతు' ఇస్తామంటున్న టిడిపి

మరోవైపు తాము అధికారంలోకి వస్తే జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించి ఆదుకుంటామని ప్రచారంలో భాగంగా పలాస వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అదే విధంగా ప్రచారంలో భాగంగా ఎంపీ రామ్మోహన్ నాయుడు, పలాస ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్ జీడికి మద్దతు ధర కల్పించి జీడి రైతుకి అండగా ఉంటామంటూ హామీ ఇచ్చారు. ఈ ప్రకటనలతో జీడి రైతు కొంత ఉపశమనం చెందుతున్నాడు.



మద్దతు ధర కోసం పోరాడుతున్న జీడిరైతు సంఘం నాయకులు, రైతులు (ఫైల్ ఫొటో)

భరోసా లేకపోతోంది



తాను రూ.30 వేలకు మూడు ఎకరాల జీడితోట కౌలుకు చేశాను. గతంలో ఒక నెల కష్టపడితే రూ.10 వేల నుంచి రూ. 12వేలు మిగిలేది. ప్రస్తుతం నిలకడలేని ధరలతో ఇబ్బందులు పడుతున్నాం. లాభం మాట అటుంచి అసలు వస్తే చాలన్నట్టు ఉంది. అదే నిలకడైన ధరలు ఉంటే మాతోపాటు ఇచ్చిన రైతుకి భరోసా ఉంటుంది. కనీసం ఈ ఏడాదైనా జీడికి గిట్టుబాటు ధర కల్పిస్తే నాలాంటి ఎందరికో మేలు చేసినవారవుతారు.

- మానేక దాశరథి, కౌలు రైతు, తొత్తిడిపుట్టుగ

స్పష్టమైన హామీ ఇవ్వాలి



జీడిపిక్కల మద్దతు ధరపై రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీ ఇవ్వాలి. ఏడాదికి పైగా మద్దతు ధర కోసం పోరాడుతున్నాం. లక్షమంది రైతుల సంతకాలు కూడా ముఖ్యమంత్రికి అందించాం. ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి జీడి రైతుల సమస్యలు, మద్దతు ధరతో లబ్ధిపొందే వేల కుటుంబాల వివరాలు మొత్తం క్షుణ్ణంగా వివరించాం. వైసిపి మేనిఫెస్టోలో జీడిరైతు 'మద్దతు' లభిస్తుందని ఆశించాం. అది జరగలేదు. ఇక టిడిపి కూడా ఇప్పటివరకూ ఎటువంటి హామీ ఇవ్వలేదు. మొన్న చంద్రబాబు నాయుడు పలాస వచ్చినప్పుడు కూడా జీడి రైతుకు అండగా ఉంటామనే అన్నారు. మద్దతుపై స్పష్టమైన హామీ ఇవ్వలేదు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు మా పోరాటాన్ని గుర్తించి జీడి రైతుకు 'మద్దతు'గా స్పష్టమైన హామీ ఇవ్వాలి. లేదంటే దాని ప్రభావం రాబోయే ఎన్నికలతో పాటు భవిష్యత్‌లో స్పష్టంగా ఉంటుంది.

- తెప్పల అజయకుమార్, జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్

గ్రామాలకు పయనమైన ఎన్నికల సిబ్బంది

పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పోలింగ్‌కు కొన్ని గంటల వ్యవధి ఉండడంతో ఆదివారం ఎన్నికల సిబ్బంది గ్రామాలకు పయన మయ్యారు. శ్రీకాకుళం నియోజక వర్గం పరిధిలోని 279 పోలింగ్ కేంద్రాల్లో 1953 మంది సిబ్బందిని నియమించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో పోలింగ్ సిబ్బంది ఆదివారం ఉదయం చేరుకున్నారు. ఓటింగ్‌కు అవసరమైన ఇవిఎంలు, వివిప్యాడ్స్, ఇతర ఎన్నికల సామాగ్రిని వారికి అందజేశారు. ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రంలో ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేశారు. కౌంటర్ల వద్ద బూత్ లెవెల్ నంబర్లు, సామాగ్రిని అందజేసేందుకు నియమితులైన సిబ్బంది ఎక్కడ ఎటువంటి లోపాలకు తావు లేకుండా పూర్తి స్థాయి సామాగ్రిని అందజేశారు. ముందుగా రిజిస్ట్రేషన్ కౌంటర్లలో సిబ్బంది హాజరును తీసుకుని ఎన్నికల సిబ్బందికి డ్యూటీ ఆర్డర్లను అందజేశారు. ఇవిఎంలు, ఎన్నికల సామగ్రిని పంపిణీ చేయడానికి ఒక్కో చోట పదికి పైగా కౌంటర్లను ఏర్పాటు చేశారు. వరుస క్రమంలో ఎన్నికల సిబ్బందికి వారికి కేటాయించిన కౌంటరు వద్ద ఎన్నికల సామాగ్రిని అందజేశారు. ఎన్నికల సిబ్బందికి ఏదైనా సమస్య ఉంటే అనుమానాలను నివృత్తి చేయడానికి సహాయం కోసం హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. మైక్‌ల ద్వారా నిరంతరం సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కాస్టింగ్, వీడియో గ్రాఫర్స్, ట్రైనింగ్ సెంటర్, రిజర్వ్ స్టాఫ్ కౌంటర్, వాహనాల కేటాయింపు కోసం కూడా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ప్రతీ పంపిణీ కేంద్రం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, అవసరమైన వారికి వైద్య సేవలను అందించారు. తాగునీరు, అల్పాహారం, టీ సరఫరా చేశారు. మధ్యాహ్నం సమయంలో భోజన సదుపాయం కల్పించారు. సిబ్బందికి ఎక్కడా ఎటువంటి సమస్య తలెత్తకుండా అధికార యంత్రాంగం డిస్ట్రిబ్యూషన్ చేపట్టారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్



కేంద్రాలకు పయనమైన పోలింగ్ సిబ్బంది

కలెక్టర్ పరిశీలన

నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇవిఎంలు, ఇతర ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి డా.మనజీర్ జిలానీ సమూన్ సందర్శించారు. కౌంటర్ల వారీగా ఆయన సిబ్బందితో మాట్లాడారు. ఎప్పటికప్పుడు అనుమానాలను నివృత్తి చేసేందుకు వీలుగా రిటర్నింగ్ అధికారి సిహెచ్ రంగయ్యకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా ఇవిఎంలు కేటాయించిన ప్రొసీడింగ్ అధికారులకు సోమవారం ఉదయం 5 గంటల నుంచి విధులకు సిద్ధమయ్యేలా సూచనలు చేశారు. మాక్ పోలింగ్‌పై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరడంతో వారికి మైక్‌లో అందరికి వినిపించేలా పలు సూచనలు, అనుమానాలు నివృత్తి చేశారు. ఆయనతో పాటు సహాయక కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్‌డిఒ రంగయ్య , మోహనరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సచివాలయానికి పోయేదెలా...?

ప్రజాశక్తి- పొందూరు

రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో అధ్వానంగా కనిపిస్తున్న ఈ దృశ్యం పొందూరు మండలం కోటిపల్లి గ్రామంలోనిది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు సచివాలయానికి పోయే రహదారిలో నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయం ముందర ప్రధాన రహదారి ఎత్తుగా ఉండడంతో వర్షపునీరు వెళ్లడానికి వీలులేక ఇలా నిలిచిపోతుంది. దీంతో పలు సమస్యలపై సచివాలయానికి వెళ్లే ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సచివాలయం ముందర రహదారి, కాలువలు నిర్మాణం చేపట్టాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.



సచివాలయం ముందర రహదారిపై నిలిచిన వర్షపునీరు

ఓటు వేసి భవిష్యత్‌ను నిర్దేశిద్దాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సోమవారం జరగ బోయే శాసనసభ, లోక్ సభ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ పాల్గొని ఓటు వేసి భవిష్యత్‌ను నిర్దేశిద్దామని ఓటు ప్రాము ఖ్యతను తెలుపుతూ సైకత శిల్పి గేదెల హరికృష్ణ సైకత శిల్పాన్ని చెక్కారు. మండలంలోని గాజుల కొల్లివలస వద్ద ఉన్న సంగమేశ్వర స్వామి కొండ దిగువున ఈ సైకత శిల్పాన్ని చెక్కారు. పలువురు సైకత శిల్పాన్ని తిలకించి ఆయనను అభినందించారు.



ఓటు ప్రాముఖ్యత తెలుపుతూ వేసిన సైకతశిల్పం